సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం | 6 | జూన్ | 2025



సేవలకు సెలవంటూ...

10 లో


శ్రీకామాక్షీ పీఠాధిపతి కామేశ మహర్షి సేవా ప్రస్థానం ముగిసింది. పీఠాధిపతి అస్తమించారన్న వార్త కోనసీమ ప్రజలను విషాదంలో నింపింది.



రూ.లక్ష విరాళం

కొత్తపేట: వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నప్రసాద భవన నిర్మాణానికి చంద్రదిలీప్ కుమార్ దంపతులు (విజయవాడ తాడిగడప) రూ.1,00,116 విరాళం అందజేశారు.

కడలిలోకి 15,700 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం 15,700 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 200, మధ్య డెల్టాకు 100, పశ్చిమ డెల్టాకు 200 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజ్ వద్ద నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

అన్నదానానికి విరాళాలు



దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి జగన్మోహినీ కేశవ, గోపాలస్వామి ఆలయంలో అన్నదాన పథకానికి గ్రామానికి చెందిన పేర్చెర్ల శాన్వితరాజు గురువారం రూ.50,116 విరాళం అందజేశారు. అలాగే, పేర్చెర్ల నాగ వెంకట అనిందిత్‌వర్మ రూ 10,116, పేర్చెర్ల భానురిధి రూ.5 వేలు, చెరుకునీడి ఉదయ్ కిషన్, హేమలత దంపతులు, కుమార్తెలు చోళ లతీక్ష, రిత్యశ్రీ (ఏలూరు) రూ.5,116 చొప్పున విరాళాలు సమర్పించారు.

రూ.2.50 లక్షల వెండి గరగ సమర్పణ



వెండి గరగను ఆలయ కమిటీకి అందజేస్తున్న దాతలు

మామిడికుదురు: పాశర్లపూడిలంక గ్రామ దేవత శ్రీ చింతాలమ్మ వారికి అదే గ్రామానికి చెందిన తెలగారెడ్డి రాధాకృష్ణ, కృష్ణవేణి, తెలగారెడ్డి వెంకట సాయిరామ కనకరాజు, స్పందన దంపతులు గురువారం రెండున్నర కిలోల వెండితో చేయించిన గరగను సమర్పించారు. దీని విలువ రూ.2.50 లక్షలని తెలిపారు. సంప్రోక్షణ అనంతరం, ప్రత్యేక పూజలు చేయించి గరగను అమ్మవారికి సమర్పించారు. దాతలను సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, కమిటీ సభ్యులు అభినందించారు.

డీఎస్సీ అభ్యర్థులకు రిక్వెస్ట్ స్టాప్‌ల సదుపాయం

అమలాపురం రూరల్: డీఎస్సీ పరీక్షలు జరిగే భట్లపాలెం, చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలల వద్ద ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్‌లు ఏర్పాటు చేశామని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్‌టీపీ రాఘవ కుమార్ తెలిపారు. ఆయా రూట్లలో తిరిగే అన్ని బస్సులను ఆ కేంద్రాల వద్ద ఆపాలని అమలాపురం, రాజోలు, రావులపాలెం, రామచంద్రపురం ఆర్టీసీ డిపోల అధికారులకు, ఉద్యోగులకు సూచనలిచ్చామని వివరించారు. రెండు కేంద్రాలను గురువారం సందర్శించామని తెలిపారు. ఈ మేరకు ఆ కేంద్రాల వద్ద రిక్వెస్ట్ స్టాపు బోర్డులు కూడా ఏర్పాటు చేశామన్నారు.


4 రోజుల పాటు విద్యుత్ అంతరాయాలు

అమలాపురం రూరల్: జిల్లాలోని 132 కేవీ రామచంద్రపురం, కొత్తపేట, ముమ్మిడివరం డబుల్ సర్క్యూట్ లైన్లలో 30 టవర్లు పాడవగా.. ఇప్పటి వరకూ 23 టవర్లను తిరిగి ఏర్పాటు చేశామని ఈపీడీసీఎల్ ఎస్ఈ రాజబాబు, ట్రాన్స్‌కో ఈఈ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన ఏడు టవర్లను మార్చేందుకు శుక్రవారం నుంచి నాలుగు రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలుగుతాయని పేర్కొన్నారు. ఐ.పోలవరం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అమలాపురం మున్సిపాలిటీ, అమలాపురం రూరల్, అల్లవరం, అయినవిల్లి, అంబాజీపేట, రాజోలు, మామిడికుదురు, పి.గన్నవరం, మలికిపురం, సఖినేటిపల్లి, కొత్తపేట, రావులపాలెం మండలాల్లో దశల వారీగా ఉదయం 6 నుంచి రాత్రి 7 గంటల వరకూ విద్యుత్ అంతరాయాలు ఉంటాయని వారు వివరించారు.

సమష్టి కృషితోనే ఎన్‌బీఏ గుర్తింపు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సమష్టి కృషితోనే జేఎన్‌టీయూ కాకినాడ ఇంజినీరింగ్ కళాశాలకు నేషనల్ బోర్డు అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) యూజీ స్థాయి గుర్తింపు వచ్చిందని జేఎన్‌టీయూకే వైస్ చాన్స్‌లర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మోహనరావు అధ్యక్షతన అలుమ్నీ ఆడిటోరియంలో గురువారం సాయంత్రం జరిగిన అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బీటెక్ కోర్సులైన ఈఈఈ, ఈసీఈ, సీఎస్ఈ, మెకానికల్, సివిల్ విభాగాలను ఎన్‌బీఏ బృందం గత నెలలో సందర్శించిందని, ఈ గుర్తింపు 2028 వరకూ ఉంటుందని చెప్పారు. పీజీ ప్రోగ్రామ్‌కు ఎన్‌బీఏ గుర్తింపు వచ్చేలా ఇదే తరహాలో కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ స్వరూపరాణి, ఆర్.దీక్షితులు, వివిధ విభాగాల అధిపతులు కోటేశ్వరరావు, కె.వెంకటరెడ్డి, ఆర్.మధు, ఎస్.సురేఖ, కల్యాణ్ మనోహర్, సత్యవేణి పాల్గొన్నారు.


ఆడబిడ్డకు అడుగడుగునా దగా..



- కూటమి ఏడాది పాలనలో మహిళల దరి చేరని సంక్షేమం
- ప్రతి నెలా రూ.15 వందలెక్కడో!
- కొంత మందికే ఉచిత గ్యాస్
- ఆర్టీసీ ఉచిత ప్రయాణం బహుదూరం

సాక్షి, అమలాపురం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ప్రతి హామీ నెరవేర్చడంతో పాటు.. చెప్పనివి కూడా అమలు చేసి మహిళలను మహారాణులను చేసిన ఘనత గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిది కాగా.. అరచేతిలో వైకుంఠం చూపించి, అందలం ఎక్కిన తర్వాత ఇచ్చిన హామీలను అమలు చేయని అపఖ్యాతి నేటి కూటమి ప్రభుత్వానికే దక్కింది. జగన్ హయాంలో ప్రతి సంక్షేమ లబ్ధి మహిళలకే అందించారు. ఇళ్ల పట్టాలు, ఇళ్లు కూడా వారికే అందించారు. అదే సమయంలో స్థానిక సంస్థలతో పాటు నామినేటెడ్ పదవుల్లో సైతం 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం ద్వారా వారికి రాజ్యాధికారం దక్కేలా చేశారు. దీనికి భిన్నంగా ప్రస్తుత కూటమి సర్కారులో సంక్షేమ పథకాల అమలే లేకుండా పోయింది. మహిళలకు ప్రతి నెలా ఇస్తామన్న రూ.1,500, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలుకే నోచలేదు. మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అరకొరగానే అమలవుతోంది.

బాబు ష్యూరిటీ.. లేదు గ్యారెంటీ..



- కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గడచిన ఏడాది కాలంలో మహిళలకు ఎటువంటి సంక్షేమమూ అందకుండా పోయింది. అమ్మ ఒడి పథకాన్ని 'తల్లికి వందనం'గా పేరు మార్చినప్పటికీ అమలు చేయలేదు. గత విద్యా సంవత్సరం దాదాపుగా 1.45 లక్షల మంది తల్లుల ఖాతాల్లో రూ.15 వేల వంతున సుమారు రూ.217.50 కోట్లు జమ చేయాల్సి ఉండగా పూర్తిగా ఎగ్గొట్టేశారు.
- అధికారంలోకి రాగానే అర్హత ఉన్న ప్రతి మహిళకూ నెలకు రూ.1,500 చొప్పున ఇస్తామని ఎన్నికల ముందు టీడీపీ హామీ ఇచ్చింది. కూటమి సూపర్ సిక్స్ పథకంలో ఇది ప్రముఖమైనదిగా ఎన్నికల సభల్లో చంద్రబాబు గొప్పగా చెప్పుకునేవారు. అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకూ నయా పైసా కూడా ఇవ్వలేదు. ఈ పథకానికి జిల్లాలో కనీసం 4.50 లక్షల మంది అర్హులున్నట్లు అంచనా. నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి వీరికి రూ.18 వేలు ఇవ్వాల్సి ఉంది. ఈవిధంగా ఏడాది కాలంలో జిల్లాలోని మహిళలకు కూటమి ప్రభుత్వం రూ.810 కోట్లు ఎగ్గొట్టింది.
- మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కూడా టీడీపీ సూపర్ సిక్స్ హామీల్లో ఒకటి. ఏడాది గడుస్తున్నా దీని అమలులో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. తాజాగా ఆగస్టు 15 నుంచి అమలు చేస్తామని చెబుతోంది. అయితే, ఏడాది కాలంగా ఇంకా విధివిధానాల రూపకల్పనలోనే ఉన్నట్లు ప్రభుత్వం చెబుతూండటం గమనార్హం. ఉచిత ఆర్టీసీ ప్రయాణం ద్వారా జిల్లాలోని సుమారు 9 లక్షల మంది మహిళలకు ప్రయోజనం చేకూర్చాల్సి ఉంది.
- జిల్లాలో 3.90 లక్షల మంది వరకూ గ్యాస్ వినియోగదారులున్నారు. వీరికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వాల్సి ఉండగా, గత ఏడాది ఒక్కటి మాత్రమే ఇచ్చారు. అది కూడా సగం మందికేనన్న విమర్శలున్నాయి. తరువాత మరో ఉచిత సిలిండర్ ఇచ్చిన దాఖలాలు లేవు.



పోస్టరు మిగిలింది: సూపర్ సిక్స్‌లో మహిళలకు లబ్ధి చేకూరుస్తామన్న పథకాలు

నాడు అతివకు అందలం

- అమ్మ ఒడి పథకం కింద తల్లుల ఖాతాల్లో ఏటా రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం జమ చేశారు. 2019–20 విద్యా సంవత్సరంలో 1,70,994 మందికి రూ.206.991 కోట్లు, 2020–21లో 1,44,797 మందికి రూ.217.196 కోట్లు, 2021–22లో 1,45,462 మందికి రూ.218.193 కోట్లు, 2022–23లో 1,45,462 మందికి రూ.218.193 కోట్ల చొప్పున అందజేశారు.
- పాలిటెక్నిక్, ఎంబీఏ, ఎంసీఏ, ఇంజినీరింగ్, డీఎడ్, బీఎడ్ వంటి ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన అందించేవారు. సుమారు 29,878 మంది తల్లుల ఖాతాల్లో విడతకు రూ.25.80 కోట్ల వరకు అందించేవారు. ఇలా ఏటా మూడుసార్లు అందజేసేవారు. వసతి గృహాల్లో చదువుకున్న 9,591 మంది విద్యార్థులకు వసతి దీవెన సొమ్ము సైతం తల్లుల ఖాతాలకు జమ చేశారు.
- స్వయం సహాయక సంఘాల్లోని (ఎస్‌హెచ్‌జీ) పొదుపు మహిళలు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను ఐదేళ్ల క్రితం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో స్వయంగా తెలుసుకున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత 2019 ఏప్రిల్ 11వ తేదీ వరకూ ఉన్న ఎస్‌హెచ్‌జీ రుణాలను మాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. ఆవిధంగా 2020 నవంబర్ 11న మొదటి విడత, 2021 అక్టోబర్ 7న రెండో విడత, 2023 మార్చి 25న మూడో విడత, 2024 మార్చి 23న నాలుగో విడత సొమ్ము చెల్లించారు. మొత్తం నాలుగు విడతలూ కలిపి మహిళా సంఘాలకు ఏకంగా రూ.1,015.96 కోట్ల మేర లబ్ధి చేకూరింది.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీలు కాకుండా ఇతర అగ్రవర్ణాలకు చెందిన 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు మహిళలకు వైఎస్సార్ ఈబీసీ నేస్తం ద్వారా లబ్ధి చేకూర్చారు. వీరికి ఏడాదికి రూ.15 వేల చొప్పున మూడేళ్లలో రూ.45 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈవిధంగా జిల్లాలోని 11,496 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.53.03 కోట్లు వేశారు.
- మగ్గం ఉన్న చేనేత కార్మికులకు ఏటా రూ.24 వేల చొప్పున వైఎస్సార్ నేతన్న నేస్తం సొమ్ము అందించారు. దీని ద్వారా గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో 17,811 మందికి రూ.43.33 కోట్ల మేర లబ్ధి చేకూరింది. దీనివలన నేత కార్మికులు బయట అప్పులు చేయనవసరం లేకుండానే తమకు కావాల్సిన ముడి సరకు, రంగుల వంటివి కొనుగోలు చేసుకోగలిగారు.
- ఆర్థికంగా వెనుకబడిన కాపు కుటుంబాలకు మేలు చేసేందుకు గత ప్రభుత్వం వైఎస్సార్ కాపు నేస్తం పథకాన్ని అమలు చేసింది. కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల మహిళలకు ఏడాదికి రూ.15 వేల చొప్పున ఐదేళ్లలో రూ.75 వేలు అందజేసింది. ఈ పథకంలో జిల్లావ్యాప్తంగా 34,962 మంది మహిళలకు రూ.165.609 కోట్ల మేర లబ్ధి చేకూరింది.
- వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎస్‌హెచ్‌జీల్లోని పేద మహిళల ఆర్థిక ఉన్నతికి గత ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. వారు తయారు చేస్తున్న ఉత్పత్తులను బహుళజాతి కంపెనీల ద్వారా విక్రయించడంతో పాటు, బ్యాంకుల ద్వారా సకాలంలో రుణాలిచ్చేలా చర్యలు చేపట్టింది. తొలి ఏడాది అమూల్, హిందూస్తాన్ యూనీలీవర్, ఐటీసీ, ప్రొక్టర్ అండ్ గ్యాంబుల్, అలానా వంటి వ్యాపార దిగ్గజాలతో, బ్యాంకులతో ఒప్పందాలు చేసుకుంది. రెండో సంవత్సరం జియో – రిలయన్స్, గ్రామీణ వికాస కేంద్రం, టీనేజర్, మహేంద్ర-ఖేతి వంటి బహుళ జాతి సంస్థలతో ఒప్పందాలు చేసుకొని మహిళల ఆర్థిక అభ్యున్నతికి దోహదపడింది.
- స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత గత సీఎం వైఎస్ జగన్‌కే దక్కింది. దీనివల్ల అమలాపురం, మండపేట, రామచంద్రపురం మున్సిపల్ చైర్‌పర్సన్లుగా మహిళలకు అవకాశం దక్కింది. మున్సిపల్ కౌన్సిలర్లు, జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్ పదవుల్లో అతివలకు 50 శాతం అవకాశం వచ్చింది. దీంతో పాటు నామినేటెడ్ పదవుల్లో సైతం 50 శాతం రిజర్వేషన్ కల్పించారు. మార్కెట్ కమిటీలు, దేవస్థానాలు, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ల పదవులలో సగానికి పైగా మహిళలకే అవకాశం ఇచ్చారు.



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మహిళలకు ఆసరా పథకం లబ్ధి అందిస్తున్న అధికారులు (ఫైల్)



> వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం ఎన్నికలప్పుడు చెప్పిన వాగ్దానం కాదు. మేనిఫెస్టోలో కూడా చెప్పలేదు. పేదవాడు ఎక్కడున్నా.. పేదవాడే. వారికి మంచి జరగాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని తీసుకువచ్చాం. ఒక మంచి అన్నగా, తమ్ముడిగా.. వారికి మంచి చేయాలనే బాధ్యత తీసుకున్నాను.
>
> – నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (గతంలో అన్న మాటలివి)

అమ్మ ఒడి ఇవ్వాలి



నాకు ఇద్దరు కుమారులున్నారు. పెద్దవాడు 9వ తరగతి, రెండో వాడు ఏడో తరగతి చదువుతున్నారు. అధికారంలోకి వస్తే ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు ఇస్తామన్నారు. ఒక ఏడాది గడిచిపోయి, రెండో ఏడాది వచ్చింది. రెండేళ్ల సొమ్మూ ఒకేసారి వేస్తే మా వంటి పేద కుటుంబాలకు మేలు చేసినట్లవుతుంది.

– గంటా అరుణకుమారి, గొల్లపాలెం, మలికిపురం మండలం

అది చరిత్రాత్మక నిర్ణయం



నామినేటెడ్ పదవుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించడం అనేది చరిత్రాత్మకం. అది వైఎస్ జగన్ వల్లనే సాధ్యమైంది. ఆ నిర్ణయం వల్ల అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలు, దేవస్థానాలు, ఇతర కార్పొరేషన్లలో మహిళలకు సమాన అవకాశాలు వచ్చాయి. గతంలో కేవలం సభ్యులుగా మాత్రమే ఒకరిద్దరు ఉండేవారు. ఇప్పుడు చైర్‌పర్సన్లు అవుతున్నారు.

– దంగేటి దోలామణి, అమలాపురం మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్

ఇంటింటికీ రేషన్ రద్దు అమానుషం

మాజీ ఎంపీ చింతా అనురాధ



అల్లవరం: అధ్వాన విధానాలతో కూటమి ప్రభుత్వం ప్రజలను అష్టకష్టాలు పెడుతోందని మాజీ ఎంపీ చింతా అనురాధ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇంటింటికీ రేషన్ పథకం ద్వారా లబ్ధిదారుల చెంతకే నాణ్యమైన సరకులు పంపిణీ చేసే ఎండీయూ వ్యవస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు రద్దు చేయడం చాలా అమానుషమని అన్నారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన వ్యవస్థలను అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. ఓట్లు వేసి గెలిపించిన ప్రజలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇంటింటికీ రేషన్ పథకం రద్దు ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు చెందిన 20 వేల మంది ఎండీయూ ఆపరేటర్ల పొట్టగొట్టారని ధ్వజమెత్తారు. విద్యార్థులు, వ్యాపారులు, మహిళలు, నిరుద్యోగులు, రైతులు ఇలా ఏ ఒక్కరినీ వదలకుండా చంద్రబాబు మోసం చేస్తున్నారని అనురాధ దుయ్యబట్టారు. దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందిన ఇంటింటికీ రేషన్ పథకాన్ని రద్దు చేయడం ఆయన పాలనా వైఫల్యానికి నిదర్శమని అన్నారు. చంద్రబాబు నిర్ణయంతో వందలాది మంది కార్డుదారులు రేషన్ డిపోల వద్ద గంటల తరబడి నిలబడే పరిస్థితి మళ్లీ మొదలైందన్నారు. ఇంటి వద్దకే అందుతున్న సేవలపై ఎందుకు అంత కక్షని చంద్రబాబును ప్రశ్నించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించాల్సిన ప్రభుత్వమే, ఆ సేవలను నిర్వీర్యం చేస్తోందని ఆక్షేపించారు. ఏమాత్రం మానవత్వం ఉన్నా ఇంటింటికీ రేషన్ పథకాన్ని పునఃప్రారంభించాలని అనురాధ డిమాండ్ చేశారు.

పర్యావరణ పరిరక్షణే మనకు రక్ష



పేరూరు ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న డీఈవో సలీం బాషా, ఏపీసీ మమ్మీ తదితరులు

రాయవరం: పర్యావరణాన్ని పరిరక్షిస్తే అది మనల్ని కాపాడుతుందని జిల్లా విద్యా శాఖ అధికారులు అన్నారు. ఆ శాఖ ఆధ్వర్యాన జిల్లావ్యాప్తంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం గురువారం నిర్వహించారు. పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. నేషనల్ గ్రీన్‌కోర్ ఆధ్వర్యాన మొక్కలు నాటారు. జిల్లావ్యాప్తంగా 1,581 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు మొక్కలు నాటడంతో పాటు, పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం బాషా, సమగ్ర శిక్షా ఏపీసీ జి.మమ్మీ, ఉప విద్యాశాఖాధికారులు జి.సూర్యప్రకాష్, పి.రామలక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచే డీఎస్సీ

- జిల్లాలో రెండు ఆన్‌లైన్ కేంద్రాలు
- పరీక్షలు రాయనున్న 11,795 మంది

రాయవరం/అమలాపురం రూరల్: ఉపాధ్యాయ నియామకానికి నిర్వహిస్తున్న డీఎస్సీ–2025 పరీక్షలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఈ నెల 30 వరకూ జరిగే ఈ పరీక్షల నిర్వహణకు జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ రావిరాల నేతృత్వంలో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) కావడంతో కంప్యూటర్ సౌకర్యాలున్న కేంద్రాలను ఈ పరీక్షలకు ఎంపిక చేశారు. జిల్లా వ్యాప్తంగా 11,795 మంది అభ్యర్థులు ఈ పరీక్ష రాయనున్నారు. జిల్లాలోని అమలాపురం రూరల్ భట్లపాలెంలోని బీవీసీ ఇనిస్టిట్యూట్ టెక్నాలజీ, కాట్రేనికోన మండలం చెయ్యేరులోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలల్లో డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 వరకూ, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పరీక్షలు నిర్వహిస్తారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. ఒక్కో కేంద్రంలో ఒక్కో సెషన్‌కు 170 మంది పరీక్షలు రాసే అవకాశముంది.

స్క్రైబ్స్‌కు అవకాశం

విజువల్లీ హ్యాండీక్యాప్డ్ (వీహెచ్), ఆర్థో హ్యాండీక్యాప్డ్ (ఏహెచ్) రెండు చేతులూ లేని వారికి స్క్రైబ్స్‌ను (సహాయకులు) ఏర్పాటు చేసుకునే అవకాశం ఇస్తారు. ఇంటర్మీడియెట్ అర్హత కలిగిన వారిని స్క్రైబ్స్‌గా ఏర్పాటు చేసుకోవచ్చు. అవసరమైన వివరాలు ఆయా సెంటర్లలో తెలియజేస్తారు. వీహెచ్‌లో స్క్రైబ్ వాడుకునే వారికి 50 నిమిషాల అదనపు సమయం కేటాయిస్తారు. ఏహెచ్ వారికి అదనపు సమయం వర్తించే అవకాశం లేదు. అంగవైకల్యాన్ని పరిశీలించి, మెడికల్ బోర్డు (డీఎంహెచ్ఓ) జారీ చేసిన సర్టిఫికెట్ ఉన్న వారికి మాత్రమే స్క్రైబ్స్ ఏర్పాటు చేసే అవకాశముంది. హాల్ టికెట్‌పై ఫొటోగ్రాఫ్ లేని వారికి తాజా ఫొటోగ్రాఫ్‌పై గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన వాటిని పరీక్షలకు అనుమతిస్తారు. జిల్లాలో 18 మంది వీహెచ్, 8 మంది ఏహెచ్ అభ్యర్థులను గుర్తించినట్లు సమాచారం.



డీఎస్సీ పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ నిషాంతి

పకడ్బందీగా పరీక్షలు

రెండు పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లను ఎస్పీ బి.కృష్ణారావుతో కలసి జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి గురువారం పరిశీలించారు. రెవెన్యూ, పోలీస్, విద్యా శాఖ, ఆర్టీసీ, ఇతర లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, జిల్లా విద్యా శాఖ అధికారి (డీఈఓ) డాక్టర్ షేక్ సలీం బాషా తదితరులు సమీక్షలో పాల్గొన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, ఎటువంటి అక్రమాలు, అవకతవకలకు తావులేని విధంగా ప్రశాంతంగా నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షలు ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహిస్తున్నందున కంప్యూటర్లు, సాంకేతిక పరికరాల్లో ఎటువంటి ఇబ్బందులూ లేకుండా కళాశాల యాజమాన్యాలు చర్యలు చేపట్టాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. హాజరయ్యే అభ్యర్థుల సంఖ్య కన్నా పది శాతం కంప్యూటర్లను అదనంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఒక డిపార్ట్‌మెంటల్ అధికారి పర్యవేక్షిస్తూంటారు. అమలాపురం డీవైఈఓ జి.సూర్యప్రకాశం ఆధ్వర్యాన ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు చేపడుతుంది. అభ్యర్థులకు ఎటువంటి సమస్య వచ్చినా పరిష్కరించేందుకు డీఈఓ కార్యాలయంలో 98663 87500, కలెక్టరేట్‌లో 96664 37749 నంబర్లతో కమాండ్ కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు చేశారు.

ఏ రోజు ఏ పరీక్షంటే..

తేదీ	సబ్జెక్టు
6	టీజీటీ గణితం (ఇంగ్లిషు మీడియం)
8	ఎస్ఏ హిందీ
9	ఎస్ఏ ఫిజిక్స్
10	ఎస్ఏ బయాలజీ
11	ఫిజికల్ డైరెక్టర్
12	ఎస్ఏ గణితం
13	ఎస్ఏ ఇంగ్లిష్, ఎస్‌జీటీ
14	పీజీటీ బోటనీ, పీజీటీ పీఎస్, పీజీటీ సోషల్ స్టడీస్ (ఇంగ్లిష్ మీడియం)
16, 17	ఎస్ఏ సోషల్ స్టడీస్
17, 18	ఎస్‌జీటీ
19	పీజీటీ బయోసైన్స్ (ఇంగ్లిష్ మీడియం), ఎస్‌జీటీ
20, 21	ఎస్‌జీటీ
22	టీజీటీ–తెలుగు, పీఈటీ–వీహెచ్
23, 24	ఇంగ్లిషు ప్రొఫిషియెన్సీ టెస్ట్
25	టీజీటీ–సైన్స్ (ఇంగ్లిషు మీడియం), పీజీటీ హిందీ, టీజీటీ–సైన్స్ (ఇంగ్లిషు మీడియం)
26	టీజీటీ–ఇంగ్లిష్, పీఎస్ (ఇంగ్లిష్ మీడియం)
27	టీజీటీ సోషల్ స్టడీస్ (ఇంగ్లిష్ మీడియం)
28	పీజీటీ–ఇంగ్లిష్
29, 30	ఎస్ఏ తెలుగు


గంట ముందుగానే చేరుకోవాలి



డీఎస్సీ అభ్యర్థులు నిర్ణీత సమయానికి గంట ముందుగానే ఆయా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరు. హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ఒక గుర్తింపు కార్డు తప్పనిసరి. – డాక్టర్ షేక్ సలీం బాషా, డీఈఓ, అమలాపురం

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీల్లో కార్టూనిస్ట్ శేఖర్‌కు బహుమతి



బహుమతి పొందిన కార్టూన్



కార్టూనిస్ట్ శేఖర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఛత్తీస్‌గఢ్ ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్ బోర్డ్, కార్టూన్ వాచ్ పత్రికల సంయుక్త నిర్వహణలో జాతీయస్థాయిలో నిర్వహించిన కార్టూన్ పోటీల్లో నగరానికి చెందిన కార్టూనిస్ట్ శేఖర్ తృతీయ బహుమతి సాధించారు. నిర్వాహకులు త్రియంబక్ శర్మ గురువారం ఆ వివరాలను వెల్లడించారు. ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్, బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్ అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీలో విజేతలకు నగదు బహుమతితోపాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేయనున్నారు. బహుమతి పొందిన కార్టూన్లను నగర కూడళ్లలో హోర్డింగ్స్, వాల్‌పోస్టర్లు, కరపత్రాల ద్వారా ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది.

అనాథ శవానికి అంత్యక్రియలు



కొత్తపేటలో అనాథ శవాన్ని మోసుకెళుతున్న సలాది చిన్ని తదితరులు



మృతుడు నాగేశ్వరరావు (ఫైల్)

కొత్తపేట: అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు స్థానిక యువకులు. పోలిశెట్టి నాగేశ్వరరావు (82) అనే సాధువు గురువారం స్థానిక కార్పొరేషన్ సత్రం అరుగుపై చనిపోయాడు. కాపు నాయకుడు సలాది రామమోహనరావు (చిన్ని) ఆధ్వర్యంలో యువకులు అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడు నాగేశ్వరరావు కొత్తపేటలో 50 సంవత్సరాల నుంచి సాధువుగా భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతనికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వృద్ధాప్య పింఛను మంజూరైంది. ఉష్ణోగ్రతలు పెరగడంతో వడదెబ్బ తగిలి మృతి చెందాడు. అంత్యక్రియల్లో పాయసం సతీష్, సలాది బాబి, సలాది నాని పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కోరుకొండ: మండలంలోని గాదరాడ పుష్కర కాలువ వద్ద ప్రమాదవశాత్తూ పడిపోయిన గెద్దాడ సురేష్ (33) హస్పిటల్‌లో చికిత్సపొందుతూ గురువారం మృతిచెందాడు. గండేపల్లి మండలం మురారికి చెందిన సురేష్ బుధవారం పుష్కర కెనాల్ వద్ద పడిపోయాడు. అతన్ని రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్టు కోరుకొండ ఏఎస్సై రంగారావు తెలిపారు. మృతుడు సురేష్‌కు భార్య, చిన్నపిల్లాడు ఉన్నారు, రాజమహేంద్రవరం ఐరెన్‌షాపులో భార్యభర్తలిద్దరూ పనిచేస్తున్నారు.

సేవలకు సెలవంటూ...

- శ్రీకామాక్షీ పీఠాధిపతి కామేశ మహర్షి అస్తమయంతో కోనసీమలో విషాదం
- అనాథలను అక్కున చేర్చుకున్న మానవతావాది
- అన్నార్తుల ఆకలి తీర్చిన దాన శీలి
- చిందాడగరువు, హంసవరంలో ఆలయాల నిర్మాణం
- పీఠంలో నిత్యం పూజా కార్యక్రమాలు
- మూడు పర్యాయాలు కంచి కామకోటి పీఠాధిపతుల రాక



కామాక్షీ పీఠం ప్రేమ మందిరంలోని అనాథ పిల్లలతో పీఠాధిపతి కామేశ మహర్షి (ఫైల్)

అమలాపురం టౌన్: శ్రీకామాక్షీ పీఠాధిపతి కామేశ మహర్షి (88) సేవా ప్రస్థానం ముగిసింది. మానవ సేవే మాధవ సేవ అనే భావనతో ఆయన జీవితాంతం నడిచారు. పీఠాధిపతి అస్తమించారన్న వార్త కోనసీమ ప్రజలను విషాదంలో నింపింది. ఆరు నెలలుగా అస్వస్థతగా ఉన్న ఆయన గురువారం తెల్లవారు జాము 3.30 గంటలకు పీఠంలోనే తుది శ్వాస విడిచారు. పీఠాధిపతి ఆజన్మాంతం బ్రహ్మచారిగానే ఉండి సమాజానికి సేవలు అందించారు. ఈయన స్వగ్రామం తుని సమీపంలోని హంసవరమైనప్పటికీ అమలాపురంలో పుట్టి పెరగడంతో పట్టణంలోనే పీఠాన్ని ఏర్పాటు చేశారు. 1938 ఏప్రిల్ 2న జన్మించారు. అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో డిగ్రీ, మద్రాసు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీలో ఏఎంఐఈ చదివారు. ఈయన అసలు పేరు బెహరా యర్రంరాజు. పీఠాధిపతి అయ్యాక కామేశ మహర్షి అయ్యారు.

1967లో పీఠం ఏర్పాటు

అమలాపురంలోని కృష్ణారావు వీధిలో శ్రీకామాక్షీ పీఠాన్ని 1967లో స్థాపించారు. కంచి కామకోటి పీఠాధిపతి శంకరాచార్య జయేంద్ర సరస్వతీ స్వామి అనుగ్రహం, ఆశీస్సులతో కామేశ మహర్షి పీఠాధిపతి అయ్యారు. కామేశ మహర్షి కంచి కామకోటి పీఠానికి అనేక సార్లు వెళ్లడమే కాకుండా జయేంద్ర సరస్వతీ స్వామీజీని అమలాపురం పీఠానికి 1976, 1996 సంవత్సరాల్లో తీసుకుని వచ్చారు. రెండేళ్ల



పీఠాధిపతి కామేశ మహర్షి పార్థివ శరీరం



అమలాపురంలోని కామాక్షీ పీఠానికి వచ్చిన కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామీజీకి స్వాగతం పలుకుతున్న కామేశ మహర్షి (ఫైల్)

కిందట కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతీ స్వామీజీని పీఠానికి తోడ్కొని వచ్చి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ పీఠాధిపతుల ఆశీర్వాదాలతోనే కామాక్షీ పీఠం ప్రస్థానం సాగింది. కామాక్షీ పీఠం ట్రస్ట్‌ను స్థాపించి కార్యవర్గం ఆధ్వర్యంలో సేవలు కొనసాగించారు.

అనాథ పిల్లల కోసం ప్రేమ మందిరం

1996 సంవత్సరంలో పెను తుపానుతో కోనసీమలో ప్రాణ నష్టం భారీగా జరిగింది. తుపానులో వందలాది మంది మృత్యువాత పడినప్పుడు తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన పిల్లలను చూసి పీఠాధిపతి చలించారు. ఈ క్రమంలో అదే సంవత్సరం పీఠంలోనే అనాథ పిల్లల ఆశ్రమం పేరుతో ప్రేమ మందిరం నెలకొల్పారు. వరసకు సోదరి అయిన వక్కలంక వాణికి ఆ ప్రేమ మందిరం అమ్మగా బాధ్యతలు అప్పగించారు. కన్న బిడ్డల కంటే ఎక్కువగా ప్రేమ మందిరం అమ్మ వాణి అనాథలను చూసుకుంటున్నారు. ఇన్నేళ్లలో ప్రేమ మందిరంలో దాదాపు 600 మంది అనాథ పిల్లలు ఆశ్రమం పొందారు. అనాథ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి వారు ప్రయోజకులు అయ్యేలా చేశారు. సుమారు 50 అనాథ ఆడ పిల్లలకు యుక్త వయస్సు వచ్చాక పెళ్లిళ్లు చేసి మెట్టింటికి పంపించారు. ప్రస్తుతం 60 మంది అనాథలు ఆశ్రయం పొందుతున్నారు.

సేవలు అనంతం

కామేశ మహర్షి ఇటు పీఠంలోనే కాకుండా అనేక గ్రామాల్లో తన సేవలను కొనసాగించారు. పీఠంలో నిత్యం పూజాదికాలు నిర్వహించారు. కార్తిక, శ్రావణ, మాఘ మాసాల్లో మహిళలతో సామూహిక పూజలు చేయించేవారు. అన్నదానం అంటే ఆయనకు అమితమైన ఇష్టం. గ్రామాల్లో అనేక అన్నదానాలు నిర్వహించారు. అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లి గ్రామంలో గోశాలను నెలకొల్పి 60 గోవులకు ఆశ్రయం కల్పించారు. తుని సమీపంలోని హంసవరంలో శ్రీకామాక్షీ ఆలయాన్ని, అమలాపురం రూరల్ మండలం చిందాడగరువులో అమలేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించారు. దానికి అనుబంధంగా చిందాడ మడుగులో వేలాది మంది భక్తులు పుణ్య స్నానాలు చేసేలా ఏర్పాట్లు చేశారు.

ఎన్నెన్నో పురస్కారాలు

కామేశ మహర్షి తన సేవా ప్రస్థానంలో పలు సంస్థల నుంచి ఎన్నెన్నో పురస్కారాలు అందుకున్నారు. మద్రాసు అకాడమి నుంచి ఉగాది పురస్కారం, రాజీవ్ విజ్ఞాన్ పురస్కారం, అల్లూరి స్మారక పురస్కారం, సహస్రాబ్ది పురస్కారం, శతాబ్ది సేవా పురస్కారం, ఎన్టీఆర్ స్మారక ట్రస్ట్ నుంచి జాతీయ పురస్కారం, అక్షర నీరాజన పురస్కారం, ప్రభుత్వం నుంచి సేవా పురస్కారాలను అందుకున్నారు.

నేడు అంత్యక్రియలు

కామేశ మహర్షి పార్థివ దేహానికి పీఠంలోనే శుక్రవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించేందుకు పీఠం ట్రస్ట్ బోర్డు నిర్ణయించింది. కామేశ మహర్షి జీవించి ఉండగానే తన అంత్యక్రియలు పీఠంలోనే జరగాలని ప్రదేశాన్ని కూడా సూచించారు. ఆయన సూచనల మేరకే అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉత్తరాధికారి రాఖీ ప్రేమ్ తదుపరి పీఠాధిపతి

పీఠాధిపతి కామేశ మహర్షి శివైక్యం కావడంతో ప్రస్తుతం పీఠం ఉత్తరాధికారిగా ఉన్న బాల బ్రహ్మచారి వికానస రాఖీ ప్రేమ్‌ను తదుపరి పీఠాధిపతిని చేసేందుకు కామాక్షీ పీఠం ట్రస్ట్ బోర్డు నిర్ణయానికి వచ్చింది. ఇంత కాలం పీఠం ట్రస్ట్‌కు అధిపతిగా ఉన్న కామేశ మహర్షి స్థానే ప్రేమ మందిరం అమ్మ, వరసకు ఆయన సోదరి వక్కలంక వాణి బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రేమ మందిరంలో పెరిగి పెద్ద అయిన, పీఠాధిపతి ప్రియశిష్యుడు మర్రి దుర్గారావు ఎప్పటిలాగే పీఠం మేనేజర్ బాధ్యతలు నిర్వహిస్తారు.

గాయత్రీ మాతకు 1,008 మామిడి పండ్లతో అభిషేకం



మామిడి పండ్లతో గాయత్రీ మాత

అమలాపురం టౌన్: స్థానిక ఎర్ర వంతెన వద్ద గల వేదమాత గాయత్రీ దివ్య భవ్య సాధన మందిరంలో అమ్మవారికి 1,008 మామిడి పండ్ల అభిషేకం గురువారం కనుల పండువగా జరిగింది. గాయత్రీ మాత జయంతి సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకూ మందిరం నిర్మాణకర్తలు ఆకుల బాబి, శ్రీదేవి దంపతుల ఆధ్వర్యంలో ఈ పూజాదికాలు జరిగాయి. మధ్యాహ్నం 12 గంటలకు అన్న సమారాధన నిర్వహించారు. గాయత్రీ మాత జయంతి సందర్భంగా మందిర ప్రాంగణంలో పిల్లల నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

స్వామివారి పెళ్లికి అంకురార్పణ

కల్యాణ తిలకం దిద్దుకున్న బాలబాలాజీ



స్వామి, అమ్మవార్ల బుగ్గన కల్యాణ తిలకం దిద్దుతున్న అర్చకుడు



స్వామి, అమ్మవార్లకు సహస్ర కలశాభిషేక సేవ



సహస్ర కలశారాధన పూజల్లో పాల్గొన్న ఈఓ సత్యనారాయణరాజు దంపతులు

మామిడికుదురు: జ్యేష్ఠ శుద్ధ దశమి శుభ ముహూర్తంలో వేద మంత్రాలు, భక్తుల గోవిందనామ స్మరణలు, మంగళ వాయిద్యాలు, కర్పూర పరిమళ సుగంధ ద్రవ్యాల నడుమ శ్రీబాలబాలాజీ స్వామి తిరు కల్యాణోత్సవాలకు గురువారం అంకురార్పణ జరిగింది. పాంచరాత్ర ఆగమానుసారం శ్రీబాల బాలాజీ స్వామి వారి వార్షిక దివ్య తిరు కల్యాణోత్సవాలకు శ్రీకారం చుట్టారు.

ఆలయ ఉప ముఖ్య అర్చక గొడవర్తి శ్రీనివాసాచార్యులు, త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి వారి శిష్యులు యాజ్ఞిక బ్రహ్మ చలమచర్ల వేణుగోపాలాచార్యులు బృందం ఆధ్వర్యంలో శ్రీవారి వార్షిక కల్యాణోత్సవాలు వేడుకగా ప్రారంభమయ్యాయి. బాల బాలాజీ స్వామితో పాటు శ్రీదేవి, భూదేవిలను చూడముచ్చటగా అలంకరించారు. బుగ్గన చుక్క పెట్టి, నుదుటన కల్యాణం తిలకం దిద్ది పెండ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలుగా ముస్తాబు చేశారు. ఎటువంటి ఆటంకాలు కలుగకుండా స్వామి వారి కల్యాణోత్సవాలు నిర్విఘ్నంగా జరగాలని కోరుతూ విష్వక్సేనారాధన కార్యక్రమాన్ని ఘనంగా జరిపించారు. ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు దంపతులు 108 కలశాలతో పాటు బ్రహ్మ కలశంలో పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, పసుపు, కుంకుమతో స్నపన తిరు మంజన సేవను వైభవోపేతంగా జరిపించారు. సేకరించిన పుట్ట మన్నును తొమ్మిది పాత్రల్లో నింపి అంకురార్పణ కార్యక్రమాన్ని నయనానందకరంగా జరిపించారు. పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశనం, పరిషదక్షిణ, మృత్సంగ్రహణం, హోమం, తదితర కార్యక్రమాలు వైభవోపేతంగా నిర్వహించారు. కల్యాణోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు, పుష్పాలంకరణ భక్తులను అమితంగా ఆకట్టుకున్నాయి.

నేటి కార్యక్రమాలు

కల్యాణోత్సవంలో భాగంగా రెండవ రోజు జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి శుక్రవారం ఉదయం 6 గంటలకు ఆరాధన, శ్రీస్వామి వారికి సహస్ర నామార్చన. ఏడు గంటలకు బాల భోగం నివేదన, నిత్య హోమం, బలిహరణ, తీర్థ ప్రసాద గోష్ఠి. ఎనిమిది గంటలకు చతుస్థానార్చనలు. 10 గంటలకు ధ్వజారోహణ, నీరాజన మంత్ర పుష్పాలు. తీర్థ ప్రసాద గోష్ఠి. రెండు గంటలకు శ్రీస్వామి వారి గ్రామోత్సవం (ఊరేగింపు) అనంతరం ఆరాధన. 6 గంటలకు సాయంకాలార్చన, చతుస్థానార్చనలు, నిత్యోపాసన, బలిహరణ. 8 గంటలకు స్వామి వారి రాయబారోత్సవం (ఎదుర్కోలు ఉత్సవం). 9.15 గంటలకు శ్రీస్వామి వారి దివ్య తిరు కల్యాణ మహోత్సవం. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఉదయం 9 గంటలకు శ్రీలలితా విష్ణు సహస్ర నామ పారాయణం, 11 గంటలకు శ్రీఅన్నమాచార్య సంకీర్తన విభావరి, మధ్యాహ్నం ఒంటి గంటకు స్వామి వారి తిరువీధి ఉత్సవంలో భాగంగా కోలాటం ప్రదర్శన.

ఆలయాల్లో చోరీలు చేసే ఆటోడ్రైవరు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న త్రీటౌన్ పోలీసులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): అందరూ దేవుడి గుడికి వెళ్లి మొక్కులు తీర్చుకునేందుకు హుండీల్లో డబ్బులు వేస్తే ఇతగాడు హుండీలు దొంగిలించేందుకు ఆలయాలకు వెళుతుంటాడు. జిల్లాలో పలు ప్రాంతాల్లో చిన్న చిన్న ఆలయాల్లో హుండీలు కొల్లగొడుతున్న దొంగను రాజమహేంద్రవరం మూడో పట్టణ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. స్టేషన్ ఆవరణలో గురువారం విలేకరులకు సెంట్రల్ డీఎస్పీ కె.రమేష్ బాబు, మూడో పట్టణ సీఐ వి.అప్పారావు, ఎస్సై వి.అప్పలరాజు ఆ వివరాలు తెలిపారు. కాకినాడ జిల్లా తొండంగి మండలంలోని అసూరు గ్రామానికి చెందిన పారేపల్లి బాబి రాజమహేంద్రవరం గోకవరం బస్టాండులో టీ దుకాణంలో పనిచేసేవాడు. ఆ తర్వాత ఆటో డ్రైవరుగా మారాడు. కొన్నాళ్లకు సులువుగా డబ్బు సంపాదించేందుకు ఆలయాల్లో హుండీలు చోరీ చేయాలన్న తలంపు వచ్చింది. అందుకు పథక రచన చేసుకుని ఆలయాల గేట్లు కోసేందుకు కట్టర్ కొన్నాడు. దొంగతనం చేసేందుకు నిర్దేశించుకున్న ఆలయానికి పగటి సమయంలో భక్తుడిలా వెళ్లి ఆనుపానులు పరిశీలించేవాడు. రాత్రి సమయంలో ఆ ఆలయం సమీపంలో ఆటోను ఆపి ఎవరికీ అనుమానం రాకుండా చూసుకుంటాడు. జన సంచారం తగ్గిన తరువాత ముందే సిద్ధం చేసుకున్న ఎలక్ట్రికల్ కట్టర్‌తో ఆ గుడి కరెంటు ఉపయోగించుకుని గేటు కట్ చేస్తాడు. లోపల హుండీ తాళాన్ని కూడా కోసి డబ్బు మొత్తం దోచుకుని వెళతాడు. దొంగతనానికి వెళ్లినా ఇతడికి ఉన్న దైవ భక్తి కారణంగా ఆలయంలో విగ్రహాలపై ఉండే వస్తువులను ముట్టుకునేవాడు కాదు. ఇలా రాజమహేంద్రవరం మూడో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో నాలుగు ఆలయాల్లో, కోరుకొండ పరిధిలో ఒక ఆలయంలో హుండీలు దోచుకున్నాడు. ఆలయాల్లో వరుస దొంగతనాలతో ఎస్పీ నరసింహకిశోర్ ఆదేశాల మేరకు క్రైం అదనపు ఎస్పీ అర్జున్ పర్యవేక్షణలో దర్యాప్తు చేసి సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడిని గుర్తించారు. లింగంపేట వద్ద వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా నిందితుడిని అరెస్ట్ చేశారు. హుండీల డబ్బుతో గోవా వెళ్లి జల్సా చేయాలని కొంత డబ్బు దాచినట్టు విచారణలో నిందితుడు పోలీసులకు చెప్పాడు. నిందితుడి నుంచి రూ.95 వేలు నగదు, నేర పరికరాలు, ఆటో, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుళ్లు బి.విజయకుమార్, పి.మహేష్‌కుమార్, కె.పవన్‌కుమార్, కె.శ్రీనివాసులను ఎస్పీ అభినందించారు.

దళితులను విద్యకు దూరం చేయొద్దు

ప్రాథమిక పాఠశాల తరలింపుపై ఎంఈవో కార్యాలయం వద్ద ఆందోళన



ఎంఈవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు

తాళ్లపూడి (కొవ్వూరు): ఎస్సీ ఏరియాలో ఉన్న ప్రాథమిక పాఠశాలను తరలిస్తే తమ పిల్లలు విద్యకు దూరం అవుతారని దొమ్మేరు ఇందిరమ్మ కాలనీవాసులు వాపోయారు. కొవ్వూరు మండలం దొమ్మేరు ఇందిరమ్మ కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(స్పెషల్)ను వేరే పాఠశాలలో విలీనం చేయడంపై గ్రామస్తులు గురువారం కొవ్వూరులోని మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ముదునూరి నాగరాజు, సర్పంచ్ తానేటి కుమారి, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు రౌతు రాణి, పాసిపో బేబి, అనిమిల్లి జ్ఞానేంద్ర ఎంఈవో కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు చదివేవారు 33 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. పాఠశాల విద్యాకమిటీ, విద్యార్థుల తల్లిందండ్రులు, సర్పంచ్ పాఠశాలల తరలించరాదని చెప్పినప్పటికీ, తాము అనుకూలంగా సంతకాలు చేసినట్టు అధికారులు నివేదిక పంపడం ఏంటని ప్రశ్నించారు. 1930లో ఏర్పడిన ఈ పాఠశాల ద్వారా దళితుల పిల్లలు విద్య నేర్చుకోవడానికి అవకాశం ఏర్పడిందన్నారు. ఫౌండేషన్ స్కూల్ చేయడం వల్ల ఇక్కడ కేవలం 1,2 తరగతులు మాత్రమే మిగులుతాయని తెలిపారు. ఎంఈవో బి స్వరూప్‌కు వినతి పత్రం అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు వరిగేటి సుధాకర్, విద్యార్థుల తల్లిదండ్రులు జి.సునీల్, కె.రాజేష్, ఎ.లక్ష్మి, యాగంటి శాంతకుమారి పాల్గొన్నారు.

వాయిదాల పర్వంలో సత్రం భూముల కౌలు వేలం

అధికార కూటమి పార్టీ ఒత్తిడులే కారణమా?

తొండంగి: పిఠాపురం శ్రీసంస్థానంకు చెందిన తొండంగిలోని 478.76 ఎకరాలకు, రాజమహేంద్రవరం నాళం వారి సత్రంకు చెందిన శృంగవృక్షంలోని దాదాపు 268.64 ఎకరాలకు కౌలు వేలం ప్రక్రియ వాయిదాలు పడుతూ వస్తోంది. వీటికి మూడేళ్ల కౌలు పూర్తికావడంతో కౌలు వేలం నిర్వహించాల్సి ఉంది. ఏప్రిల్ 29న శృంగవృక్షం పంచాయతీ కార్యాలయంలో నాళం వారి సత్రం భూముల కౌలు వేలం నిర్వహించాల్సి ఉండగా బకాయిలు వసూళ్లు తదితర కారణాలతో వాయిదా వేశారు. తొండంగిలో శ్రీసత్రం భూములకు కూడా గత నెల 23న కౌలు వేలం నిర్వహించాల్సి ఉండగా పలు కారణాలతో ఈ నెల ఆరుకు వాయిదా వేశామని అప్పట్లో ఈవో శ్రీరాములు ప్రకటించారు. టీడీపీ మహానాడుకు జనాన్ని తరలించేందుకు భూముల కౌలు వేలం దక్కింప జేస్తామని ప్రకటించి వేలం వాయిదా వేయించినట్టు ఆరోపణలు వచ్చాయి. కాగా మళ్లీ శ్రీసత్రం భూముల కౌలువేలంకు సంబంధించి దండోరా వేయలేదని ఈ నెల 20కి వాయిదా వేసినట్టు గురువారం రాత్రి సాక్షికి తెలిపారు. కౌలు వేలం ప్రక్రియను వాయిదాల పర్వం వెనుక అధికార కూటమిలోని పార్టీ హస్తం ఉన్నట్టు తెలుస్తోంది. వేలంలో కౌలు దక్కించుకుని సాగుకు సన్నద్ధమవుదామన్న రైతుల ఆశలకు గండి కొడుతూ వాయిదాలు వేస్తున్నారు. సాగులో ఉన్న రైతులు తక్కువకు దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. త్వరగా కౌలు వేలం నిర్వహిస్తే సాగుకు సిద్ధమవుతామని, తద్వారా కౌలు ఆదాయం పెరుగుతుందని కౌలు వేలంలో పాల్గొనాలనుకుంటున్న రైతులు చెబుతున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నిడదవోలు రూరల్: పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు సమిశ్రగూడెం ఎస్సై ఎల్.బాలాజీ సుందరరావు గురువారం తెలిపారు. అత్తిలి మండలం మంచిలి గ్రామానికి చెందిన ఎజ్జిర్ల మధు కుమారుడు విక్రమ్ అనే ఇస్సాకు (19) చేపల చెరువుల వద్ద కాపలా ఉంటూ జీవనోపాధి పొందుతున్నాడు. తల్లిదండ్రులు ఇద్దరూ ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉండటంతో కొంతకాలంగా మానసిక ఆందోళనలో ఉన్న ఇస్సాకు ఈ నెల 3వ తేదీన నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామానికి చెందిన మేనత్త ఆబోతు మరిమమ్మ ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం ఇస్సాకు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడటంతో రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

అమలాపురంలో సైబర్ మోసం

గ్రీజు డబ్బా కొనుగోలు పేరుతో రూ.24 వేలకు టోకరా



అమలాపురం టౌన్: ఓ సైబర్ నేరగాడు గ్రీజు డబ్బా కొనుగోలు పేరుతో షాపు యజమానికి రూ.24 వేలకు టోకరా వేసిన ఉదంతమిది. స్థానిక శ్రీనివాస ఏటిగట్టు ప్రాంతంలో బ్రహ్మం రేడియేటర్స్ అండ్ మొబైల్ షాపు యాజమాని టి.సత్యనారాయణకు ఓ ఆగంతకుడు బుధవారం సాయంత్రం హిందీలో మాట్లాడుతూ ఫోన్ చేశాడు. 5 కేజీల గ్రీజు డబ్బా కావాలని ధర అడిగాడు. రూ.వెయ్యి అని చెప్పగానే మీ షాపునకు మా మనిషిని పంపుతాను, డబ్బా అతని చేతికివ్వమని ఆగంతకుడు షాపు యజమానికి చెప్పాడు. మీకు రూ.వెయ్యి ఫోన్ పే చేస్తున్నానని చెప్పి కొద్దిసేపటికి మీ అకౌంట్లో పొరపాటున రూ.10 వేలు సొమ్ము వేశాను. మీకు ఇవ్వాల్సిన రూ.వెయ్యి తీసుకుని మిగిలిన రూ.9 వేలు మీ ఫోన్‌కు ఓ స్కానర్ పంపిస్తున్నాను, దానికి డబ్బు పంపమని చెప్పాడు. అకౌంట్‌లో డబ్బు పడిందో లేదో చూడకుండా కేవలం మెసేజ్‌కు స్పందించిన షాపు యాజమాని రూ.9 వేలు ఆగంతకుడు పంపించిన స్కానర్‌కు పంపించేశారు. తర్వాత కొద్ది సేపటికి మీ ఫోన్‌కు మరో రూ.15 వేలు పొరపాటున పంపించాను, ఆ డబ్బును కూడా స్కానర్‌లో పంపించండని మెసేజ్ పెట్టాడు. నేనెక్కడో ఉన్నాను. ఇక్కడ డబ్బు ఫోన్ పే చేయాలని, అర్జంటుగా నాకు డబ్బు పంపించాలని షాపు యాజమానిని ఆగంతకుడు నమ్మించాడు. షాపు యాజమాని రూ.15 వేలు కూడా స్కానర్ ద్వారా పంపించేశారు. దీంతో మొత్తం రూ.24 వేలు ఆగంతకుడు పంపిన స్కానర్‌కు పంపించారు. తర్వాత ఫోన్ పేలో అకౌంట్ బ్యాలెన్స్‌ను చెక్ చేసుకుంటే రూ.24 వేలు డ్రా అయినట్లు కనిపించింది. దీంతో తాను సైబర్ మోసానికి గురైనట్టు షాపు యజమాని గ్రహించి సైబర్ పోలీసులకు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశారు.